విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

చందానగర్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధి మైత్రీనగర్‌లో త్రివేణి హైస్కూల్‌లో 10వ తరగతి పరీక్షా ఫలితాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను శుక్రవారం ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అభినందించారు. లక్ష్యం ఏర్పరచుకొని ఆ దిశగా సాగాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎర్లీబర్డ్.. రూ. 58.97 కోట్లు పన్ను వసూలు



జోనల్ కమిషనర్ హేమంత్‌ను కలిసిన డీసీ

చందానగర్: ఎర్లీబర్డ్ స్కీమ్ కింద చందానగర్ సర్కిల్ -21 పరిధిలో రూ.58.97 కోట్లు ఆస్తి పన్ను వసూలు చేశామని ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-2025కి రూ.53.44 కోట్లు వసూలు కాగా, ఈ ఏడాది 2025-2026 సంవత్సరానికి గాను రూ.58.97 కోట్లు వసూలు చేసిందన్నారు. ఏప్రిల్ 30న ముగిసిన ఎర్లీ బర్డ్ పథకం కింద 56,624 మంది ఆస్తిపన్ను చెల్లించారన్నారు.

కొత్త జోనల్ కమిషనర్ కలిసిన చందానగర్ డీసీ

శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన హేమంత్‌ను ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. జడ్సీని కలిసిన వారిలో ఏసీపీ నాగిరెడ్డి, ఏఎంసీ విజయ్ కుమార్, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



శ్రీవారి సువర్ణ కిరీటధారణ మహోత్సవంలో ఎమ్మెల్యే గాంధీ

చందానగర్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మైత్రీనగర్ అలివేలుమంగా పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి సువర్ణ కిరీటధారణ మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది.ఉత్సవానికి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ హాజరై ప్రత్యేక పూజలు చేశారు కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ యాదవ్, లక్ష్మారెడ్డి, మైత్రీనగర్ దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉగ్రదాడికి నిరసనగా ముస్లింల ర్యాలీ

ఆల్విన్‌కాలనీ: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాద దాడిని నిరసిస్తూ ఎల్లమ్మబండలో శుక్రవారం ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. నమాజ్ అనంతరం ఎల్లమ్మబండ చౌరస్తాలోని మిస్సైల్‌మెన్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేశారు. జాతీయ జెండాలను చేత పట్టుకొని నినాదాలు చేశారు. మతంపై ద్వేషం పెంచుకొని దాడులు చేయటం దారుణమన్నారు. దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలను ఆదుకోవాలని, ఈ దాడులకు బాధ్యులైన తీవ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

విద్యుదాఘాతం.. గాయపడ్డ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి

గచ్చిబౌలి: విద్యుదాఘాతంతో ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి తీవ్రంగా గాయపడ్డాడు. గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గచ్చిబౌలిలోని డెలిగేట్స్ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో గత మూడు సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్ శ్రీకాకుళంకు చెందిన ఉపేందర్(28) పని చేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం గచ్చిబౌలి ఫ్లైఓవర్ వద్ద ఎలక్ట్రిక్ కేబుల్‌ను సరి చేస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. వెంటనే అతన్ని హిమగిరి ఆస్పత్రికి తరలించారు. 40 శాతం కాలిన గాయాలతో చికిత్స పొందుతున్నాడు. విద్యుత్ అధికారులు ఉపేందర్‌ను పరామర్శించారు. గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.... గురువారం నిర్వహించిన డ్రైవ్‌లో 10 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహన దారులను శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఏడుగురికి రూ. వెయ్యి జరిమాన, ఇద్దరికీ రూ.2 వేలు, మరో వ్యక్తికి రూ.1500 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

అండర్‌పాస్..
అవస్థలెన్నో..

విస్తరణను మరిచిన రైల్వేశాఖ • హఫీజ్‌పేట్ ఆర్‌యూబీలో రాకపోకలు ఒక వైపే



ఇరుకుగా ఉన్న హఫీజ్‌పేట్ ఆర్‌యూబీ



హఫీజ్‌పేట్ ఆర్‌యూబీ వద్ద ఒక వైపు నుంచి మాత్రమే వెళుతున్న వాహనాలు

- వాహనదారులకు నిత్య నరకం
- ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ జాం
- అండర్ పాస్ ప్రతిపాదన కాగితాలకే పరిమితం

గచ్చిబౌలి: హఫీజ్‌పేట్‌లో రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) ఇరుకుగా ఉండటంతో నిత్యం ట్రాఫిక్ జాం నెలకొంటుంది. వాహనాల రాకపోకలకు ఒక వైపు మాత్రమే అవకాశం ఉండటంతో వాహనాలు బారులుదీరుతున్నాయి. దీంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు.ఐటీ ఉద్యోగులతో పాటు జనాభా పెరిగిపోతుండడంతో ప్రయాణం సాఫీగా సాగేలా లింకు రోడ్లు నిర్మించారు. కానీ దీనికి అనుసంధానంగా ఆర్‌యూబీ విస్తరణ చేయకపోవడంతో సమస్య నెలకొంది. మియాపూర్ ట్రాఫిక్ పోలీసులు సిగ్నల్ ఏర్పాటు చేసి ఒక వైపు మాత్రమే వాహనాలకు అనుమతి ఇస్తున్నారు. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటోంది.



మంజీరా రోడ్డు నుంచి ఆర్‌యూబీ వైపు వచ్చే వాహనాలు

విస్తరణ అవసరం..

వంద అడుగుల రోడ్లకు అనుసంధానంగా ఆర్‌యూబీని రెండు వరుసలుగా విస్తరించడం తప్పనిసరి. కాంతివనం జంక్షన్ నుంచి హఫీజ్‌పేట్ ఆర్‌యూబీ వరకు రోడ్డు విస్తరణ చేపట్టాలి. అందుకు తగ్గట్లుగా ఆర్‌యూబీ విస్తరణ లేదంటే అండర్ పాస్, రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ) ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఐటీ కారిడార్‌కు ఉత్తరం వైపు.. పశ్చిమం వైపు వరకు రైల్వే లైన్ ఉండటంతో హైటెక్‌సిటీ నుంచి ఆర్‌ఓబీలు, ఆర్‌యూబీలు, అండర్ పాస్‌లు ఏర్పాటు చేయాల్సి వస్తోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక చొరవ చూపితేనే అనుమతులు వచ్చే వీలుంది.

ట్రాఫిక్ సమస్య ఇలా..

మియాపూర్, చందానగర్, మదీనాగూడ, ఆర్సీపురం, అమీన్‌పూర్, పటాన్‌చెరు తదితర ప్రాంతాల నుంచి ఐటీ ఉద్యోగులు హఫీజ్‌పేట్ ఆర్‌యూబీ గుండా రాకపోకలు సాగిస్తుంటారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటోంది.దీంతో ఆర్‌యూబీ నుంచి పైప్‌లైన్ రోడ్డు వరకు వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయి. సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల వరకు మసీద్‌బండ, శ్రీరాంనగర్ కాలనీ వైపు వచ్చే వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ జాం ఏర్పడుతోంది. మసీద్‌బండ రోడ్డు నుంచి కాంతివనం వరకు 100 అడుగుల రోడ్డు, జీహెచ్ఎంసీ ఆఫీస్ నుంచి కాంతివనం వరకు 100 అడుగుల లింకు రోడ్డును ఏర్పాటు చేశారు. రెండు వైపులా వచ్చే వాహనాలు ఒక వరుసలో ఒక వైపు మాత్రం ఆర్‌యూబీ నుంచి వెళ్లాల్సి ఉంది. ఇక వర్షం వస్తే కిలోమీటర్ల పొడవునా వాహనాలు నిలిచిపోతున్నాయి.

ట్రాఫిక్ పెరిగే అవకాశం

మసీద్‌బండ రోడ్డు నుంచి మై హోం మంగళ రోడ్డులో బహుళ అంతస్తుల నిర్మాణాలు ఇంకా వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే కొన్ని నిర్మాణంలో ఉండగా ఖాళీ స్థలాలు ఉన్నాయి. శిల్పాగార్డెన్, ఉడ్ ల్యాండ్ కాలనీ, కాంతివనం, సెంట్రల్ పార్క్, జీవీ జీహిల్స్‌లో నిర్మాణాలు ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్నాయి. మంజీరా రోడ్డు వెంట బహుళ అంతస్తుల నిర్మాణాలు భారీ సంఖ్యలో ఉన్నాయి. హఫీజ్‌పేట్ ఆర్‌యూబీకి అతి సమీపంలో వేలాది ఫ్లాట్లు ఉన్న ఓ గేటెడ్ కమ్యూనిటీ త్వరలోనే ప్రారంభం కానుంది. దీంతో వాహనాల రద్దీ అంతకంతకు పెరిగే అవకాశం ఉంది.



హఫీజ్‌పేట్ ఆర్‌యూబీ ముందు ఒక వరుస రోడ్డు

అండర్‌పాస్ ప్రతిపాదన కాగితాలకే..

హఫీజ్‌పేట్ ఆర్‌యూబీ ఇరుకుగా ఉండటంతో వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకొని బీఆర్ఎస్ హయాంలోనే అండర్‌పాస్ కోసం రైల్వే శాఖకు ప్రతిపాదనలు పంపారు. రెండేళ్లు కావస్తున్నా రైల్వేశాఖ మాత్రం అనుమతి ఇవ్వలేదు. రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నా రైల్వేశాఖ అనుమతి రాకపోవడంతో అండర్ పాస్ ప్రతిపాదన కాగితాలకే పరిమితమైంది.

సమస్య పరిష్కారానికి కృషి



రైల్వే అండర్ పాస్ కోసం ప్రతిపాదనలు పంపినా ఇప్పటి వరకు రైల్వేశాఖ నుంచి అనుమతి రాలేదు. హఫీజ్‌పేట్ ఆర్‌ఓబీ నుంచి మంచినీటి పైపులైన్, డ్రైనేజీ కాలువ ఉంది. వాటిని కూడా పరిగణనలోకి తీసుకొని అండర్ పాస్ ఏర్పాటు చేసేందుకు వీలుంది. రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ దృష్ట్యా అండర్ పాస్ నిర్మాణం తప్పని సరి. అండర్‌పాస్ ప్రతిపాదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ప్రయత్నిస్తా. – ఎమ్మెల్యే గాంధీ, శేరిలింగంపల్లి

టీఎల్ఎఫ్ ప్రత్యేక సమావేశం

చందానగర్: చందానగర్ సర్కిల్-21 లో శుక్రవారం టీఎల్ఎఫ్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ జూన్ ఆఖరుకు 3,782 కొత్త మహిళా సంఘాలు ఏర్పాటు చేయాలని నిర్దేశించారని పేర్కొన్నారు. వార్డుల వారీగా ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. రాజీవ్ యువ వికాసం పథకంలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నవారు తమ దరఖాస్తులను సర్కిల్ కార్యాలయంలో అందచేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన వారికి కొత్త పెన్షన్ల మంజూరునకు సర్కిల్ కార్యాలయంలో అర్హులు దరఖాస్తులు అందించాలని సూచించారు.కొత్త సంఘాల ఏర్పాటు జూన్ నెలాఖరువరకు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎల్ఎఫ్, ఓబీ సభ్యులు, ఆర్పీలు, యూసీడీ సిబ్బంది పాల్గొన్నారు.

అరుదైన శస్త్ర చికిత్స



సమావేశంలో మాట్లాడుతున్న డా.ముఖర్జీ

చందానగర్: భారతదేశంలో మొట్టమొదటి టోటల్ ఎండోస్కోపిక్ కరోనరీ రివాస్కులరైజేషన్ వయా థొరాకోటమీ (టీసీఆర్‌ఏటీ)ను పల్స్‌హార్ట్ సూపర్ స్పెషాల్టీ హాస్పటల్‌లో విజయవంతంగా నిర్వహించారు. శుక్రవారం మియాపూర్‌లోని పల్స్‌హార్ట్ ఆస్పత్రిలో చికిత్స అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రముఖ కార్డియాలజిస్ట్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎంఎస్ఎస్ ముఖర్జీ మాట్లాడుతూ టీసీఆర్‌ఏటీని విజయవంతంగా నిర్వహించామన్నారు. టీసీఆర్‌ఏటీ అనేది అధునాతన సాంకేతికత అని ఇది ఛాతీ ఎడమ వైపున చిన్న కోత ద్వారా బ్లాక్ చేయబడిన ధమనులను దాటవేస్తుందన్నారు. నొప్పి తక్కువగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ వంశీకృష్ణ, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ మొవ్వా శ్రీనివాస్, కార్డియాక్ అనస్థీషియాలజిస్ట్ డాక్టర్ శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు



పూర్ణాహుతిలో పాల్గొన్న భక్తులు



అన్నపూర్ణాదేవి

రాయదుర్గం: గచ్చిబౌలి శివసాయిక్షేత్రంలో ఆలయ14 వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఆదిశంకరాచార్య జయంతిని పురస్కరించుకొని కాశీవిశ్వేశ్వరుడు, అన్నపూర్ణాదేవి, గణపతి, ఆంజనేయస్వామి, షిర్డీసాయిబాబా,ధన్వంతరి స్వామికి అర్చనలు, పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నప్రసాద వితరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భెల్ ప్రహరీ గోడ సమస్య.. ఎంపీకి వినతి



మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు వినతి పత్రం అందజేస్తున్న భెల్ ఎంఐజీ కాలనీవాసులు

శేరిలింగంపల్లి: భెల్ సంస్థ నిర్మించతలపెట్టిన ప్రహరీ గోడను నిలిపివేసి, భెల్ ఎంఐజీ కాలనీవాసులకు ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకునేలా చొరవ తీసుకోవాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావును బీజేపీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జి ఎం.రవికుమార్‌యాదవ్ కోరారు. శుక్రవారం భెల్ ఎంఐజీ కాలనీ వాసులతో కలిసి సమస్యను వివరించారు. సానుకూలంగా స్పందించిన రఘునందన్‌రావు మాట్లాడుతూ స్వయంగా పరిశీలించి, పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తోపుగొండ మహిపాల్‌రెడ్డి, కాలనీవాసులు నారాయణరావు, జనార్దన్ రెడ్డి, రాములు, పెంటయ్య గౌడ్, వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కులగణన దేశానికే ఆదర్శం



రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం చేసిన జగదీశ్వర్ గౌడ్

చందానగర్: తెలంగాణ రాష్ట్రం చేపట్టిన కులగణన దేశానికే ఆదర్శమని కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం మాదాపూర్ డివిజన్ పరిధిలోని సుభాష్‌చంద్రబోస్ కాలనీలో కులగణనపై కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ డివిజన్ అధ్యక్షులు నగేష్ నాయక్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అన్ని పార్టీల అభిప్రాయాల తీసుకున్నాకే బడుగు బలహీన వర్గాలు సామాజిక, రాజకీయ, ఉద్యోగాల్లో ఎదగాలని తెలంగాణ ప్రభుత్వ ఆకాంక్ష అని అన్నారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి కోఆర్డినేటర్ రఘునందన్ రెడ్డి, నగేష్ నాయక్, సౌందర్య రాజన్, రెహమాన్, హనీఫ్, ఇస్మాయిల్, ముక్తార్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: టీఎన్‌జీఓ కాలనీలోని 11 కేవీ కొమరం భీమ్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ భాస్కర్ తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 3.30 గంటల వరకు అంబికా సూపర్ మార్కెట్, పెద్దమ్మ దేవాలయం, బీఎన్ చౌరస్తా, వెంకటేశ్వరస్వామి దేవాలయం ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన వివరించారు.

- ఖాజాగూడ 11 కేవీ ఫీడర్ పరిధిలో.. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఖాజాగూడ, ఏసీ అట్లాంటిక్ అపార్ట్‌మెంట్స్, వీకర్ సెక్షన్ కాలనీ, ఖాజాగూడ విలేజ్, ఓక్రిడ్జ్ స్కూల్, కుమ్మరి బస్తీ, సాయిఐశ్వర్య, అపర్ణా టవర్స్, నానక్‌రాంగూడ, మీనాక్షి ప్రాంతాలలో ..
- 11 కేవీ జేవీకాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 9 నుంచి 9.30గంటల వరకు జేవీకాలనీలో,
- 11 కేవీ ఎస్కీ విద్యుత్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు జయభేరి ఎన్‌క్లేవ్, ఎస్కీ స్టాఫ్ కాలేజ్ ప్రాంతాలలో..
- 11 కేవీ ఓల్డ్ గచ్చిబౌలి ఫీడర్ పరిధిలో.. సాయంత్రం 4.30 గంటల నుంచి 5 గంటల వరకు ఇందిరానగర్, ఓల్డ్ గచ్చిబౌలి, సెంట్రల్‌మాల్ పరిధిలో .
- 11 కేవీ సాయిఐశ్వర్య విద్యుత్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 9 గంటల నుంచి 9.30 గంటల వరకు నానక్‌రాంగూడ, సాయిఐశ్వర్య లే అవుట్, మీనాక్షిటవర్స్ ప్రాంతాలలో ..
- 11 కేవీ రాయదుర్గం ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 3 నుంచి 3.30 గంటల వరకు రాయదుర్గం, మధురానగర్ ప్రాంతాల్లో..
- 11 కేవీ పీజేఆర్‌నగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.30 గంటల నుంచి 11 గంటల వరకు మహిళా మండలి లేన్, గాయత్రి నెస్ట్, ఆర్‌టీటీసీ ప్రాంతాలలో..
- 11 కేవీ బ్రహ్మకుమారీస్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 4 గంటల నుంచి 4.30 గంటల వరకు రాక్ ఎన్‌క్లేవ్, బ్రహ్మకుమారీస్ సంస్థ,ఎస్ఎంఆర్ సింఫనీ, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్, సుందరయ్య విజ్ఞాన కేంద్రం ప్రాంతాలలో..

శేరిలింగంపల్లిలో..

శేరిలింగంపల్లి: 11 కేవీ గోపన్‌పల్లి విద్యుత్ ఫీడర్, 11 కేవీ లక్ష్మీవిహార్ ఫీడర్ పరిధుల్లో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు నల్లగండ్ల విద్యుత్ అధికారులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు గోపన్‌పల్లితండా, గోపన్‌పల్లి , డాక్టర్స్‌కాలనీ, లక్ష్మీ విహార్ తదితర ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.

- 11 కేవీ నేతాజీనగర్ ఫీడర్ పరిధి, 11 కేవీ ఎన్‌టీఆర్‌నగర్ ఫీడర్ పరిధుల్లో.. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి 4.30 గంటల వరకు నేతాజీనగర్, డాక్టర్స్‌కాలనీ, ఎన్‌టీఆర్‌నగర్, సోఫాకాలనీలో..
- 11 కేవీ దూబేకాలనీ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు దూబే కాలనీలో విద్యుత్ ఉండదని తెలిపారు.

చందానగర్‌లో..

చందానగర్: చందానగర్ సెక్షన్ పరిధి హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ దీప్తి పేర్కొన్నారు.

- మార్తాండనగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 9.30 నుంచి 10.00 గంటల వరకు మార్తాండనగర్, న్యూ హఫీజ్‌పేట్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.
- మార్తాండనగర్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు మార్తాండనగర్, న్యూ హఫీజ్‌పేట్, హనీఫ్ కాలనీ ఏరియాలలో..
- గణేష్ టెంపుల్ ఫీడర్ పరిధిలో సాయంత్రం 4.00 గంటల నుంచి 4.30 గంటల వరకు మార్తాండనగర్, గణేష్ టెంపుల్ ఏరియాలలో..
- మార్కెట్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు సీఎం తోట, శిల్పా గార్డెన్ ఏరియాలలో .
- ప్రేమ్‌నగర్ ఫీడర్ పరిధిలో.. సాయంత్రం 4.00 గంటల నుంచి 4.30 గంటల వరకు ప్రేమ్‌నగర్, న్యూ హఫీజ్‌పేట్, ప్రేమ్‌నగర్ బి బ్లాక్ ఏరియాలలో ..

వేమనకాలనీ సెక్షన్‌లో..

వేమనకాలనీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- ఇక్రిశాట్ ఫీడర్ పరిధిలో.. సాయంత్రం 4.00 గంటల నుంచి 5.00 వరకు ఆర్వీ నిర్మాణ్ అపార్ట్‌మెంట్స్, గ్రీన్ హిల్స్ అపార్ట్‌మెంట్స్, కెఎస్ఆర్ ఏరియా అయ్యప్ప స్వామి టెంపుల్ నుంచి అపర్ణ రోడ్డు, ఇక్రిశాట్ కాలనీ ఏరియాలలో..
- సురక్షా ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 8.30 గంటల నుంచి 11.30 వరకు విద్యానగర్, సురక్షా ఎన్‌క్లేవ్, రాజేందర్‌రెడ్డినగర్, సత్య ఎన్‌క్లేవ్, శుభోదయ కాలనీ, అపర్ణ హెటీ సర్వీస్ ప్రాంతాలలో..
- ఫ్రెండ్స్ కాలనీ ఫీడర్ పరిధిలో.. ఉదయం 8.30 గంటల నుంచి 11.30 వరకు ఫ్రెండ్స్ కాలనీ, శిల్పా ఎన్‌క్లేవ్, అర్జున్‌రెడ్డి కాలనీ, వెస్ట్ మెట్రో అపార్ట్‌మెంట్స్ ప్రాంతాలలో ..
- భిక్షపతి ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో ఉదయం 8.30 గంటల నుంచి 11.30 వరకు భిక్షపతి ఎన్‌క్లేవ్, జవహర్‌నగర్ రోడ్డు నెంబర్ 4,5,6 కైలాష్‌నగర్ శ్రీదేవి థియేటర్, ఎస్వీఎస్ ఇన్ఫ్రా లిమిటెడ్ ప్రాంతాలలో ..
- శ్రీరాంనగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 9.00 నుంచి 9.30 వరకు శ్రీరాంనగర్, అన్నపూర్ణ ఎన్‌క్లేవ్, కినారా హోటల్, గంగారం ఏరియాలలో..
- శాంతినగర్ ఫీడర్ పరిధిలో.. సాయంత్రం 4.30 గంటల నుంచి 5.00 వరకు శాంతినగర్, ఉషోదయా అపార్ట్‌మెంట్ రోడ్డు, ధర్మపురి టెంపుల్ రోడ్డు, దీప్తిశ్రీనగర్ రోడ్డు నంబర్ 14 నుంచి 25, ఆదర్శనగర్ ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మియాపూర్: మియాపూర్ డివిజన్ పరిధిలో రూ.2కోట్ల 28 లక్షల 50వేలతో నూతనంగా చేపడుతున్న సీసీ, బీటీ రోడ్ల నిర్మాణం, పార్కుల అభివృద్ధి పనులకు శనివారం ఎమ్మెల్యే గాంధీ శంకుస్థాపన చేయనున్నారు. మియాపూర్ డివిజన్‌లోని రెడ్డి కాలనీలో రూ.33.50 లక్షలతో సీసీ రోడ్డు పనులు, కృష్ణసాయి ఎన్‌క్లేవ్ కాలనీలో రూ.40లక్షలతో పార్కు అభివృద్ధి పనులకు, జనప్రియ వెస్ట్‌సిటీ కాలనీలో రూ.63.50 లక్షలతో సీసీ రోడ్డు పనులకు, ప్రశాంత్‌నగర్ కాలనీలో రూ.43.50 లక్షలతో సీసీ, బీటీ రోడ్డు, న్యూ ప్రశాంత్‌నగర్ కాలనీలో రూ.43లక్షలతో భగత్‌సింగ్ పార్కు అభివృద్ధి పనులకు కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం



నానక్‌రాంగూడలో మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన బీజేపీ నాయకులు

రాయదుర్గం: జనగణనతో పాటు కులగణన చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ గచ్చిబౌలి డివిజన్ నానక్‌రాంగూడలో ప్రధాన నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బీజేపీ గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షుడు శివాసింగ్ మాట్లాడుతూ కులగణనను దేశవ్యాప్తంగా చేయాలని నిర్ణయించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నరేంద్రముదిరాజ్, దయాకర్, సంజీవ, శ్రీకాంత్‌రెడ్డి, వరలక్ష్మీ, కిషన్, గోపాల్, నరేష్,బబ్లూసింగ్ తదితరులు పాల్గొన్నారు.

బీఎన్ఐ జాగ్వార్ చాప్టర్ ప్రారంభం

రాయదుర్గం: బిజినెస్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్ (బీఎన్ఐ) ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్ సెంటర్‌లో బిఎన్ఐ జాగ్వార్ చాప్టర్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఎన్ఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజన షా మాట్లాడుతూ ఎటువంటి వ్యాపారం చేయాలనుకుంటున్న వారికైనా తమ వ్యాపారాన్ని విస్తరించుకోవడానికి బీఎన్ఐ వేదిదిక ఎటువంటి చార్జీలు లేకుండా సహాయం చేస్తుందన్నారు.

కాలనీల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: కాలనీల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శాంతినగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన శాంతినగర్, శ్రీనగర్ జంట కాలనీల యజమానుల సంక్షేమ సంఘం కార్యాలయం నూతన భవనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పటాన్‌చెరు పట్టణం నేడు శరవేగంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.